## మినీ కథ

# మన భూమి వే(పే)ద భూమిరా!



నూరంపూడి విశ్వం

ఆరోజు సోమవారం.

శ్రీ శ్రీ గారు అన్నట్టు "ఫ్యాక్టరీలు మా పుట్టిళ్ళు. అవే మా దేవుడి గుళ్ళు" కనుక, ఆదివారం రాత్రంతా ఫ్యాక్టరీలో ఓవర్ టైం వర్క్ చేసి, తెలతెలవారుతూండగా రూంకి వచ్చి పడుకున్నాను వెచ్చగా!

అంతలోనే అవతల ఏదో కొంపలు - మునిగిపోతున్నట్టు రూం తలుపుని ఎవరో దబదబా బాదారు. బద్ధకంలోనూ, చిరాకులోనూ మంచం దిగి లేచివెళ్ళి తలుపు తీశాను.

ఎదురుగా నేను అద్దెకుంటున్న కొంప (రూం) తాలూకు ఓనరుగారు భారీ విగ్రహంతో, గిరజాల జుట్టుతో, నుదుట రూపాయి కాసంత కుంకుమ బొట్టుతో నిలబడి వున్నాడు. 'చేతిలో వేప మండలు ఒక్కటే తక్కువ. గణాచారిలా వున్నాడు!' అనుకున్నాను కసిగా, నిక్షేపంలాంటి నిద్ర పాడుచేశాడన్న కోపంతో.

అప్పటికి సమయం ఉదయం ఏడు గంటలు దాటింది. ఆయనగారు పూజకు ఉపక్రమించబోతూ వచ్చాడో లేక పూజలోంచి లేచి వచ్చాడో తెలియదు గానీ, నన్ను మాత్రం నిద్రలోంచి లేపాడు.

"బాబూ! ఈ రోజు నీకు వీక్లీ ఆఫ్ (శలవు) కదా! కాస్తంత అటుగా వెళ్ళి కరెంటు బిల్లు కట్టి పెడుదూ!" అంటూ-బిల్లు ప్లస్ డబ్బు నా చేతికి అందించి వెను తిరిగి వెళ్ళిపోయాడు పోస్ట్‌మాన్‌లా!

నేను నిద్రని మధ్యాహ్నానికి వాయిదావేసి, కాలకృత్యాలు తీర్చుకుని హోటల్ మధులతలో పెసరట్ ఉప్మా కంబైన్డ్‌గా లాగించి, ఘంటసాల స్వరంలా మాధుర్యంతో నిండిన (పంచదార ఎక్కువ అవటం చేత) కాఫీ తాగి, బిల్ చెల్లించి కోఠీ సెంటరుకు పోయే సిటీబస్ కోసం నిలబడ్డాను.

అప్పటికి సమయం ఉదయం తొమ్మిది గంటలయింది.

ఆ సమయంలో అన్ని పట్టణాల్లాగానే హైదరాబాద్‌లో కూడా బస్ స్టాపులూ, బస్‌లూ కూడా చాలా రష్‌గానూ, హడావిడిగానూ వుంటాయి, అది కాలేజీలూ, కాన్వెంట్లూ, ఆఫీసుల టైమ్ కనుక.

వాళ్ళకున్న తొందర నాకు లేదు కనుక, ఖాళీగా వున్న బస్ ఎక్కచ్చు అనుకుంటూ, నేను నిలబడ్డ బస్ స్టాప్ ప్రక్కనే వున్న పాన్ షాపులో మిఠాయి కిళ్ళీ వేసుకుని, రెడ్ విల్స్ సిగరెట్ వెలిగించాను.

అంతలో ఎవరో నా చొక్కాని పట్టి లాగినట్లనిపించి ప్రక్కకు చూశాను.

సుమారు ఎనిమిది సంవత్సరాల వయసుగల కుర్రాడు నిలబడి వున్నాడు. వాడి చేతిలో ఒక పలక, దానిమీద రెండవ తరగతి అని రాసి వున్న టెక్స్ట్ బుక్ కనబడ్డాయి నాకు. కుర్రాడు కాస్త బొద్దుగానే వున్నాడు. కళ్ళలో అమాయకత్వం తొణికిసలాడు తోంది. కాకీ నిక్కరు, పైన భుజాల వద్ద చిరిగిన తెల్ల చొక్కా వేసుకున్నాడు. ఒక పిన్ను చొక్కాని పై నుండి క్రింది దాకా కలుపుదామని చేసిన ప్రయత్నం విఫలం కావటంచేత పైన సగం, క్రింద సగం విడిపోయి వుంది.

'ఏమిటి కథ?' అన్నట్టు చూశాను వాడివైపు.

వెంటనే వాడు "సార్! నాకు స్కూలుకి టైం అయింది, కాస్తంత రోడ్డు దాటించరూ?" ప్రాధేయ పూర్వకంగా అడిగాడు.

వెంటనే వాడి చెయ్యి పట్టుకున్నాను. రోడ్ క్రాస్ చేశాం ఇద్దరం. నేను తిరిగి బస్ స్టాప్ వద్దకు వచ్చేందుకు రోడ్ దాటుదామనుకుంటుండగా నా వెనుక నుంచి "సార్! ఆకలేస్తోంది. ఒక్క పది పైసలివ్వరూ?" అంటూ దీనంగా అర్థించాడు.

అంత బుద్ధిమంతుడిలా కనిపిస్తున్న ఆ కుర్రాడు అలాగ అడిగేసరికి నాకు జాలేసింది. అంతలోనే మళ్ళీ అన్పించింది నాకు. 'వాడు అడిగిన పది పైసలు ఇవ్వటం కష్టంకాదు. కానీ అంత బుద్ధిగా చదువుకునే కుర్రాడిని పాడుచేసిన వాడినవుతానేమో?' ఇలాగ అనేక కోణాల్లో ఆలోచించాను.

'పాపం! నిజంగానే వాడికి ఆకలిగా వుందేమో? ఇప్పుడు నేను వాడికి ఇవ్వటం మానినంత మాత్రాన వాణ్ణీ, ఈ దేశాన్ని ఎలాగూ ఉద్ధరించలేను!' ఇలాగ అనుకుని వెంటనే జేబులోంచి చిల్లరతీసి ఒక అర్థ రూపాయి వాడికిచ్చి, "బాగా చదువుకో!" అంటూ రోడ్ క్రాస్‌చేసి బస్ స్టాప్ వద్ద నిలబడ్డాను.

అప్పుడే ఖాళీగా వెళ్ళిపోతున్న బస్‌ని చూడగానే — "నువ్వు ప్రయాణం చేసే రైలు ఎప్పుడూ ఒక జీవితకాలం లేటు" అన్న ఆరుద్రగారి మాటలు జ్ఞాపకం వచ్చి నాలో నేను నవ్వుకున్నాను. పాన్ షాపులో మరో సిగరెట్ కొని వెలిగించాను.

మరో పది నిమిషాల్లో బస్ రానే వచ్చింది. ఎక్కేశాను. పని పూర్తి చేసుకుని తిరిగి బస్ ఎక్కాను. కోఠీలో బస్‌ని ఒకచోట ఆపాడు డ్రైవర్. అది టిక్కెట్ ఇష్యుయింగ్ కంప్లీటింగ్ పాయింట్ కనుక, కండక్టర్ తీరుబడిగా అందరికీ టికెట్స్ ఇస్తున్నాడు. అక్కడినుంచి మరో రెండు స్టాప్స్ దాటితే నేను దిగవలసిన చోటు వస్తుంది.

ఏదో ఆలోచిస్తూ అప్రయత్నంగా కిటికీలోంచి చూశాను. బస్‌కి నాల్గయిదు గజాల దూరంలో ఇందాక నాతో మాట్లాడిన కుర్రాడు ఒక సూట్ వాలాతో ఏదో అంటున్నాడు. సూట్‌వాలా జేబులోకి చెయ్యి పోనిచ్చి, చిల్లర డబ్బులు కుర్రాడికిచ్చి వెళ్ళి పోయాడు.

ఈసారి కుర్రాడు ఎదురుగా వస్తోన్న పంచెకట్టు ఆసామితో ఏదో మాట్లాడాడు. వెంటనే ఆ ఆసామి నవ్వుతూ కుర్రాడి చెయ్యిపట్టుకుని రోడ్డు దాటిస్తున్నాడు.

నాకు విపరీతమైన కోపం వచ్చింది ఆ కుర్రాడు చేస్తోన్న పనికి. కానీ... శపించేందుకు నేను మునిని కాను. వాడిలాగే సామాన్య మానవుణ్ణి. పగటు మనిషిని. కూటికోసం తాపత్రయపడుతూ - వినియోగించుకునే కోటి విద్యలలో ఇది ఒకటి కాబోలు అనుకున్నాను. వాడిదీ సంపాదనే! నాదీ సంపాదనే! తేడా అల్లా వాడు చదవకుండానే సంపాదిస్తున్నాడు. నేను చదువుకుని సంపాదిస్తున్నాను.

ఏది ఏమయినా, మన స్వతంత్ర దేశంలో ప్రతి మనిషీ ఎలాగోలాగ బ్రతగ్గలడు అనుకున్నాను గర్వంగా!

కారణం? ... ...

మన తల్లి అన్నపూర్ణ
మన అన్న దానకర్ణ
మన భూమి వే(పే)ద భూమి కనుక!!

బస్ కదిలింది.

*